కూరగాయల సాగు.. లాభాలు బాగు

- పత్తి, వరి కంటే అధికాదాయం
- అందుబాటులో రైతు బజార్లు
- రైతులకు ఉద్యాన శాఖ ప్రోత్సాహకాలు


కుమ్మరిలోవలో సాగు చేసిన క్యాబేజీ పంట


మరువాడలో వేసిన వంగ తోట

తుని: సంప్రదాయ పంటలను నమ్ముకున్న రైతులు మిశ్రమ పంటల వైపు దృష్టి సారించారు. ఒకే పంటను వేయడంతో ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. మారుతున్న ఆధునిక వ్యవసాయానికి అనుగుణంగా రైతులు పంటమార్పిడికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మెట్ట ప్రాంతంలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వరి తర్వాత కూరగాయల సాగుకు ఆకర్షితులవుతున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు, కూరగాయలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమయ్యారు. దీంతో ఈ సీజన్‌లో సన్నకారు రైతులు 887 ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యమిచ్చారు. భూమిలో ఒకే పంటకు బదులు ఎక్కువ రకాలను సాగు చేస్తున్నారు. కొంత మంది రైతులు అంతర పంటగా కూరగాయల పంటను వేసి మంచి దిగుబడులను సాధిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిధ రకాల కూరగాయలను అన్ని సీజన్లలోను పండించడం ద్వారా ఏడాది పొడుగునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. బోరు బావులకు అవసరం మేరకు విద్యుత్ వినియోగించి దిగుబడులను సాధిస్తున్నారు. రైతులు రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

సాగు పద్ధతి ఇలా..

మెట్ట ప్రాంతమైన మూడు నియోజకవర్గాల్లో వర్షాధార భూములు ఎక్కువ. బోరుబావులున్న ప్రాంతాల్లో కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. గతంలో ఒకే పంటను వేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ విధానానికి స్వస్తి పలికి, మిశ్రమ పంటల సాగు వైపు దృష్టి సారించారు. ఎకరా భూమిలో నాలుగు నుంచి ఆరు రకాల పంటలను వేస్తున్నారు. భూమిని చిన్న మడులుగా తయారు చేసి, వాటిలో వంగ, బెండ, బీర, కాకర, ఆనప, టమాటా, తోటకూర, పాలకూర, గోంగూర, మెంతికూర, మిరప, బొబ్బర తదితర రకాల పంటలను వేస్తున్నారు. విత్తనాల ఎంపిక నుంచి ఎరువులు, నీటి యాజమాన్యం వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట మార్పిడి విధానం పాటించడం వల్ల చీడపీడలు తగ్గడంతో పాటు, దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఏడాదికి రూ.90 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

నియోజకవర్గం	కూరగాయల సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
తుని	360
ప్రత్తిపాడు	270
జగ్గంపేట	157

అందుబాటులో రైతు బజార్లు

తుని మండలంలో చామవరం, వల్లూరు, కుమ్మరిలోవ, వి.కొత్తూరు, తాళ్లూరు, కొలిమేరు, రేఖవానిపాలెం, మరువాడ, నందివొంపు, దొండవాక, కేఓ మల్లవరం, లోవకొత్తూరు, వల్లూరు తదితర గ్రామాల్లో పండించిన కూరగాయలను తుని మార్కెట్ యార్డులోని తీసుకువస్తున్నారు. రైతు బజారులో నేరుగా రైతులే అమ్ముకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోళ్లు చేసి ఎగుమతులు చేస్తున్నారు. జగ్గంపేట రైతులు రాజమహేంద్రవరం, ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన రైతులు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.

రైతులకు రాయితీలు



కాయగూరల పంటలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందిస్తున్నాం. బోరు బావి సదుపాయం ఉన్న రైతులకు డ్రిప్ ఏర్పాటు చేసుకోవడానికి 90 శాతం మేర రాయితీని ప్రభుత్వం అందిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు లాభదాయకం. మార్కెట్‌లో రాబోయే నెలల్లో మంచి డిమాండ్ ఉంటుంది. రైతులు ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– ఎం.విజయలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, తుని

కూరగాయల సాగు బాగుంది



బోరు సదుపాయం ఉన్న భూమిలో పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాను. బొప్పాయిలో అంతర పంటగా టమాటా, కొత్తిమీర, మెంతికూర, గట్లు, ముళ్ల కంపల వద్ద చిక్కుడు వేశాను. మార్కెట్‌లో ధర బాగుండడంతో మంచి ఆదాయం వచ్చింది. అర ఎకరంలో కూరగాయల ద్వారా రూ.25 వేల ఆదాయం వచ్చింది. తక్కువ నీటితో, ఎక్కువ రకాల సాగు చేస్తే రైతులకు లాభదాయకం.

– గండి రమణ, రైతు, తుని

భూసార పరీక్షలు తప్పనిసరి

డీడీఏ శ్రీహరి


రాజుపేటలో భూసార ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తున్న అధికారులు

తుని రూరల్: రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలకు ఎరువులు వాడాలని, ఇష్టానుసారంగా ఎరువుల వాడకం వల్ల అధిక పెట్టుబడులు, భూసార లోపాలు ఏర్పడతాయని కాకినాడ జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీహరి అన్నారు. మంగళవారం ఏఓ బి.అశోక్ కుమార్ అధ్యక్షతన రాజుపేటలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గత సీజన్‌లో సేకరించి, పరీక్షించిన భూసార పరీక్షా ఫలితాల కార్డులను రైతులకు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీడీఏ శ్రీహరి మాట్లాడుతూ, అధిక మోతాదులో ఎరువులు వినియోగించడం వల్ల భూములు సారాన్ని కోల్పోతుండగా, రైతులకు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ అధికారులు సూచించినట్టు మట్టి నమూనాలను సేకరించాలని, పరీక్షించిన తర్వాత భూసారాన్ని బట్టి సూక్ష్మ పోషకాలు, ఎరువులు వాడాలన్నారు. ఏ విధంగా మట్టి నమూనాలు సేకరించాలి, ఎప్పుడు సేకరించాలన్న అంశాలను రైతులకు వివరించారు. సేకరించిన మట్టిని పరీక్షించి, సారవంతం చేసుకోవాలన్నారు. ఇలా భూములను సంరక్షించుకోవడం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందన్నారు. డీఆర్‌సీ ఏఓ సంజీవ్, సామర్లకోట ఎస్ఎల్‌టీ ఏఓ విజయ్, ఈఏఓ పి.జగ్గఅప్పారావు, వీఏఏలు రాజేష్, బంగార్రాజు, శ్రీనివాస్, గాయంత్రి, రాజుపేట, చామవరం, లోవ కొత్తూరు, తాళ్లూరు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

అందరితో మర్యాదగా ప్రవర్తించాలి

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ప్రత్తిపాడు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇవ్వాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనాలను పరిశీలించారు. ముఖ్యమైన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ల్యాండ్‌లైన్ నంబర్, ఎస్సై, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫోన్ నంబర్లను అన్ని కార్యాలయాలు, వసతిగృహాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ముఖ్యమైన బహిరంగ ప్రదేశాలల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళా కేసుల్లో సిబ్బంది సత్వరమే స్పందించాలని, పోలీస్ స్టేషన్‌లో వారికి న్యాయం జరుగుతుందనే మనోధైర్యం కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. గంజాయిపై నిఘా పటిష్టపరచి, క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, డ్రగ్స్ వినియోగం, మహిళల రక్షణపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్సై ఎస్.లక్ష్మీకాంతంకు సూచించారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఉన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

- సీపీఎం జిల్లా సభ్యురాలు బేబీరాణి


బొద్దవరంలో మహిళలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తుని: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, పేదలపై విద్యుత్ చార్జీల భారం మోపిందని సీపీఎం కాకినాడ జిల్లా సభ్యురాలు బేబీరాణి విమర్శించారు. మంగళవారం కోటనందూరు మండలం బొద్దవరంలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అందరికీ నెలకు రూ.1,500 ఇస్తామన్నారని, ఉచిత బస్సు హామీ తుస్సుమనిపించారని, తల్లికి వందనం పథకంలో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఇస్తామని చెప్పి మాట తప్పారని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలను పెంచడంతో వేసవిలో ఫ్యాన్ వేసుకునే పరిస్థితి లేదని మహిళలు చెబుతున్నారన్నారు. గతంలో నెలకు రూ.200 బిల్లు వస్తే, ఇప్పుడు రూ.500 వస్తుందన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడంతో ఏడాదికి ముందే తిరుగుబాటు వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పార్టీ నాయకులు ఎస్‌కే పద్మ, ఎస్.శ్రీనివాస్, ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, అప్పల నర్స, ప్రవంతి, మంగ, కృష్ణ, బాబ్జి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

జగ్గంపేట: నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2025ను పారదర్శకంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు క్షుణ్ణంగా పరిశీలించి సవరణ చేయాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 1,200 మంది ఓటర్లు దాటితే, కొత్త పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదిస్తామని చెప్పారు. విచారణ సమయంలో బీఎల్‌ఓలకు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు జేవీఆర్ రమేష్, శ్రీనివాస్, చిరంజీవి, ఎం.సాయిప్రసాద్, నాయకులు మారిశెట్టి భద్రం, ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కోకో దిగుబడి సాధించాలి

- ఉద్యాన శాఖ అధికారి విజయలక్ష్మి


తేటగుంటలో కోకో గింజల నాణ్యతను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

తుని రూరల్: కోతల అనంతరం కోకో సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం తుని మండలం తేటగుంట గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కోకో రైతులకు కాయల సేకరణ, అనంతరం పంట సంరక్షణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహ కల్పించారు. రైతులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పక్వానికి వచ్చిన కోకో కాయలను సేకరించడం, మురగబెట్టడం, గింజలు సేకరించి ఎండబెట్టడం, నాణ్యమైన గింజలను విక్రయించడంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పంటకాలం పూర్తయ్యాక కోకో మొక్కల సంరక్షణ, దుక్కులు, కొమ్మల కత్తిరింపు తదితర అంశాలపై రైతులకు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం కిలో కోకో గింజలకు రూ.650 గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి కోకో గింజల గిట్టుబాటు ధరలో వ్యత్యాసం వస్తుందన్నారు. ప్రతి రైతు నాణ్యమైన గింజలను విక్రయానికి సిద్ధం చేసుకోవాలన్నారు. ఆత్మ మాజీ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం


రామవరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న పీడీ

జగ్గంపేట: గృహాలు నిర్మించుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థికసాయం పెంచిందని జిల్లా హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రామవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటి వరకూ యూనిట్‌కు అందిస్తున్న రూ.1.8 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్టీల్లో అట్టడుగు వర్గాలు(పీవీటీజీ)కు రూ.లక్ష ఆర్థికసాయం పెంచినట్లు వివరించారు. ఈ మేరకు ధ్రువ పత్రాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట హౌసింగ్ డీఈ వేణుగోపాలస్వామి, ఏఈ టి.శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి

గండేపల్లి: ఉద్యోగ అవకాశాల కోసం నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు అన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాల కోసం తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలన్నారు. శ్రీముద్ర టెక్నో ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తాధ్వర్యంలో మోడల్ డిజైన్, అనాలసిస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ యూజింగ్ మేట్ లాబ్ సిమ్యులేషన్ అనే అంశంపై ఈ వర్క్‌షాప్ జరిగింది. ప్రిన్సిపాల్ జి.నరేష్, విభాగాధిపతి కె.దుర్గాప్రసాద్, డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ఏలేశ్వరం: గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయనున్నట్లు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురం, మర్రివీడు గ్రామాల్లో మంగళవారం ఆయన సీసీ రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. సకాలంలో పనులు పూర్తి చేస్తారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఇజనగిరి ప్రసాద్, నైనాలశెట్టి బాబ్జీ, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


తొండంగిలోని భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తొండంగి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యను అందించే భవిత కేంద్రంలో ఐఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సేవలు, పథకాలు, విద్య తదితర అంశాల రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఐఈఆర్టీ వలంటీర్లు జగన్నాథం, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆకు కూరల పెంపకానికి కృషి

గండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆకు కూరల పెంపకానికి కృషి చేయాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పెంచిన ఆకు కూరలను మండలంలోని మురారిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆకు కూరల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, వాటిని ఉపయోగించడం ద్వారా చిన్నారుల్లో పోషకలోపాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడులే లక్ష్యం

కిర్లంపూడి: రైతులు ఆరుగాలం పండించిన పంటల్లో అధిక దిగుబడులే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో మంగళవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలకు అధిక మోతాదుల్లో ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పొలాలు సారవంతంగా చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న పచ్చిరొట్ట సాగు చేసి, దమ్ము చేయడం ద్వారా పొలానికి బలం చేకూరుతుందని తెలిపారు.

బంగారం రికార్డు ఈఓకు అప్పగింత


ఈఓ సుబ్బారావుకు బంగారం రికార్డులు అప్పగిస్తున్న పూర్వ ఈఓ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చెందిన బంగారం, ఇతర ఆభరణాల రికార్డులను పూర్వ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి ప్రస్తుత ఈఓ వీర్ల సుబ్బారావుకు మంగళవారం అప్పగించారు. దేవస్థానానికి ఈఓలు మారినపుడు పాత ఈఓ నుంచి కొత్త ఈఓకు ఈ బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీ. 2022–23 మధ్య ఈఓగా ఉన్న సత్యనారాయణమూర్తి ప్రస్తుతం ద్వారకా తిరుమల ఈఓగా పనిచేస్తున్నారు. ఆయన 2023 మార్చిలో బదిలీ అయ్యాక ఇక్కడ ఈఓలుగా చంద్రశేఖర్ అజాద్, కె.రామచంద్రమోహన్ పనిచేసినప్పటికీ, వివిధ కారణాలతో వారికి ఈ రికార్డులు అప్పగించలేదు. ఇప్పుడు వాటిని ఈఓ సుబ్బారావుకు అప్పగించారు. దేవస్థానం డీసీ చంద్రశేఖర్, దేవదాయ శాఖ జిల్లా ఆభరణాల తనిఖీ అధికారి(జేవీఓ) వీవీ పల్లంరాజు, ఏఈఓ భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ పరిశీలన


సచివాలయం-2 భవనాన్ని పరిశీలిస్తున్న భావన

ప్రత్తిపాడు: శిథిలావస్థలో ఉన్న ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ భావన మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కార్యాలయంలోని దాదాపు అన్ని విభాగాల్లో వర్షం కురిస్తే, వాన నీటితో రికార్డులన్నీ తడిసిముద్దవుతున్నాయి. ఈ విషయాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన కార్యాలయాన్ని పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్యాలయాన్ని సచివాలయం–2లోకి మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సచివాలయం–2లోకి తహసీల్దార్ కార్యాలయం తరలింపుపై సాధ్యాసాధ్యాలను అసిస్టెంట్ కలెక్టర్ భావన పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ సూర్యప్రభ, డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి ఉన్నారు.

డ్రోన్‌తో అసాంఘిక శక్తుల ఆటకట్టు


తుని టౌన్ పోలీస్ స్టేషన్లో డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీఐ

తుని: అసాంఘిక శక్తులను గుర్తించేందుకు డ్రోన్ ఎంతో ఉపయోగకరమని తుని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తుని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేయగా, మంగళవారం సీఐ పరీక్షించారు. పట్టణంలో మారుమూల, నిర్మానుష్య ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, చర్యలు తీసుకుంటామన్నారు. బందోబస్తు సమయంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు డ్రోన్ కెమెరా ఉపయోగపడుతుందన్నారు.

మర్రివీడులో వైద్య శిబిరం

ఏలేశ్వరం: మండలంలోని మర్రివీడు గ్రామంలో మంగళవారం 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయ ఫౌండేషన్ అధ్యక్షుడు, వైద్యుడు సఖిరెడ్డి విజయబాబు తన తండ్రి వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పిఠాపురం సీఎంసీ ఆసుపత్రి వారు కంటి, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలు చేశారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

ఏలేశ్వరం: పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని ఉభయ గోదావరి జిల్లాల క్వారీ కార్మిక యూనియన్ కార్యదర్శి కుప్పుల నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం క్వారీ యజమానులు పెంటకోట మోహన్, కోరాడ రాము, కొమిరి పోలురాజుతో యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ అగ్రిమెంట్ గడువు ముగియడంతో వేతనాలు పెంచాలన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని వేతనాల పెంపు ఉండాలన్నారు. ఈ నెల 24లోగా వేతనాలు పెంచకపోతే కార్మికులు పనులు బహిష్కరిస్తారన్నారు. యూనియన్ నాయకులు దేరంగుల రాజు, శిడగం వీరబాబు, నీలపల్లి సుబ్బారావు, మైలపల్లి అర్జున్, కె.వెంకటేశులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసు దాడి

గోకవరం: ఇటికాయలపల్లి గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై పవన్‌కుమార్ వివరాల మేరకు, మంగళవారం గ్రామ శివారున కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో కోరుకొండ సీఐ వై.సత్యకిశోర్ ఆధ్వర్యంలో కోరుకొండ ఎస్సై శ్యామ్‌సుందర్, గోకవరం పోలీసు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,200 నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పోస్టాఫీసుల్లో ఆధార్ అప్‌డేట్ కౌంటర్లు

గోకవరం: ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు కోరారు. గోకవరం పోస్టాఫీస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. రాజమండ్రి పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఆధార్ కార్డుకు మొబైల్ ఫోన్ అనుసంధానం, చిరునామా సవరణ కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

సీఐఎస్‌ఎఫ్ సైకిల్ యాత్రకు స్వాగతం


అన్నవరం చేరిన సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

అన్నవరం: దేశ భద్రత, సమైక్యత ఆవశ్యకతను చాటుతూ సమృద్ సంరక్షణ పేరుతో పశ్చిమ బెంగాల్‌లోని బక్కాహలి నుంచి కన్యాకుమారి వరకు సీఐఎస్‌ఎఫ్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం రాత్రి అన్నవరం చేరింది. సుమారు 2,700 కి.మీ. 60 మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఈ యాత్ర చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ యాత్రకు సర్పంచ్ ఎస్ కుమార్‌రాజా, ఎస్సై శ్రీహరిబాబు, విశ్రాంత ఆర్ఐ ప్రసాద్, పలు సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సత్యదేవ కళాశాల మైదానంలో వీరిని సన్మానించారు.

సంక్షిప్తంగా..

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర


ఊరేగింపుగా బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

జగ్గంపేట: సంత మార్కెట్ వద్ద ఉన్న సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

మట్టి అక్రమ తవ్వకాల అడ్డగింపు

గోకవరం: గంగంపాలెం గ్రామంలో మట్టి అక్రమ తవ్వకాలను రాజమహేంద్రవరం మైనింగ్ అధికారులు అడ్డుకున్నారు. కొద్ది రోజులుగా గ్రామంలోని ఓ పొలంలో చేపల చెరువును తవ్వుతూ, మట్టిని పరిసర గ్రామాల్లో లేఅవుట్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. మంగళవారం రాజమహేంద్రవరం మైనింగ్ అధికారులు ఈ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, తవ్వకాలను అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్ సాయిప్రసాద్‌ను సంప్రదించగా, మట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారులు విచారణ జరిపి, చర్యలు తీసుకుంటారని తెలిపారు.

మీటర్ రీడర్ల ఆందోళన

జగ్గంపేట: ప్రీపెయిడ్ మీటర్ల వల్ల తమ ఉపాధి దెబ్బ తింటోందని ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట డీఈ కార్యాలయం వద్ద మీటర్ రీడర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. తమ ఉపాధికి ఇబ్బంది కలగకుండా చేయాలని చ ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరుతూ డీఈ వీరభద్రరావుకు వినతి పత్రం సమర్పించారు. మీటర్ రీడర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని డీఈ తెలిపారని జగ్గంపేట మీటర్ రీడర్ల సంఘ డివిజన్ అధ్యక్షుడు పసగడుగుల నానాజీ తెలిపారు.

మానసిక సవాళ్లను అధిగమించాలి

తుని రూరల్: కౌమార బాలికలలో మానసిక, ఆరోగ్య సవాళ్లు అధికమయ్యాయని, వాటిని సమర్థంగా ఎదుర్కోవాలని కాకినాడకు చెందిన మానసిక, ఆరోగ్య సలహాదారుడు వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జీసీడీఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో కౌమార బాలికలలో మానసిక, ఆరోగ్య సవాళ్లు అనే అంశంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాలరావు మాట్లాడుతూ, కౌమార దశలో ఉన్న బాలికలు మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో రాణించగలరన్నారు. ఆ దిశగా ముందడుగు వేయాలన్నారు. మానసిక, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఏవిధంగా పరిష్కరించుకోవాలో సూచించారు. ఇటువంటి సమస్యలను అందుబాటులో ఉన్న ఆరోగ్య సిబ్బందికి తెలియజేస్తే పరిష్కరిస్తారన్నారు. సిబ్బంది అందుబాటులో లేకపోతే, సంబంధిత ఉపాధ్యాయులను సంప్రదించాలన్నారు. ప్రశాంతంగా ఉండడం, నిద్రపోవడం, పౌష్టికాహారంతో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. జోనల్ కో–ఆర్డినేటర్ దివ్య, ప్రిన్సిపాల్ అమృతవాణి, జిల్లాలోని కేజీబీవీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు ధ్రువీకరణ పత్రం ఇవ్వరా?

ప్రత్తిపాడు: నివాస గృహాల రిజిస్ట్రేషన్లకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా గ్రామ రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్ ఎంపీపీ ఏనుగు శ్రీను(బంకు శ్రీను) ఆరోపించారు. ఈ పరిస్థితి మండలంలోని రాచపల్లి గ్రామంలో నెలకొని ఉందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాచపల్లి వీఆర్వో నివాస గృహాలను రిజిస్ట్రేషన్ చేయించుకునేందు గ్రామస్తులు ధ్రువీకరణ పత్రం కోరితే, వారిని నానాయాతన పెడుతున్నారని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకుని, ధ్రువీకరణ పత్రాలు సరళంగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

శంఖవరం: రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి అధిక లాభాలు సాధించవచ్చని ఏఓ పి.గాంధీ అన్నారు. పి.మల్లాపురంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన కాయగూరలు, ఆకు కూరల స్టాల్‌ను పరిశీలించారు. నాణ్యమైన పోషకాలున్న కాయగూరలు, ఆకు కూరలు తక్కువ ధరకే అందజేస్తారన్నారు.

సాగు మెళకువలపై అవగాహన

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామంలో పంట సాగులో నూతన విధానాలు, మెళకువలపై మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం(రాజమహేంద్రవరం) విద్యార్థినులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా రైతులకు పలు సూచనలు ఇచ్చారు. గ్రామ నమూనాలు, గ్రామపటం, పంట విస్తీర్ణం, రసాయన మందుల వల్ల నష్టాలు, ప్రకృతి వ్యవసాయంవల్ల ప్రయోజనాలను వివరించారు.